## క్లుప్తంగా

### బీఫార్మసీ ఫలితాల్లో ఏఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

తెనాలిఅర్బన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన బీఫార్మసీ ఫలితాల్లో తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ ఫార్మసీ కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కంచర్లపల్లి వెంకట రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ అన్నాబత్తుని శివకుమార్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

### క్రమశిక్షణతో జీవించండి



తెనాలిఅర్బన్: క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అందరూ అలవర్చుకోవాలని ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ పేర్కొన్నారు. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు సోమవారం బి,సి సర్టిఫికెట్లు ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, దేశ శ్రేయస్సు కోసం అందరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ గురుదీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ జీఏ ఫ్.కిరణ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి కె.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

### పనితీరు మార్చుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: కాల్వల్లో మురుగు పరటం లేదు.. ప్రతి రోజు వీటిని బాగు చేస్తున్న ఎందుకు ఈ పరిస్థితి ఏర్పడదంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. పట్టణంలోని 31వ వార్డులో సోమవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వల్లో వ్యర్థాలు గుట్టలు ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని మురుగు కాల్వల పారుదల జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి, ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌సీసీలో చేరండి



తెనాలిఅర్బన్: ఎన్‌సీసీలో చేరడం వలన అనేక ఉపయోగాలు ఉంటాయని ప్రధానోపాధ్యాయులు కప్పల రాజారెడ్డి పేర్కొన్నారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వలన క్రమశిక్షణ, న్యాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సమాజ సేవ వంటివి అలవడతాయని చెప్పారు. అనంతరం 55 మందిని ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండూరు శ్రీనివాసరావు, అంబరీషుడు, 22వ ఆంధ్ర బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 అర్జీలు



తెనాలిటౌన్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 అర్జీలు వచ్చినట్లు సబ్‌కలెక్టర్ సంజనా సింహ తెలిపారు. రెవెన్యూ ఆరు, సర్వే ఒకటి, మున్సిపాలిటీ మూడు, పోలీసు డిపార్ట్‌మెంట్ రెండు, పంచాయతీరాజ్ ఒకటి, హౌసింగ్ రెండు, ఇరిగేషన్ ఒకటి వచ్చాయని, వీటిని సంబంధిత శాఖలకు బదాలయించి సమస్య నిర్ణీత సమయంలోగా పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు.

### విద్యార్థిని చదువుకు చేయూత

మంగళగిరి టౌన్: విద్యార్థిని చదువుకునేందుకు రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్ కుమార్ చేయూతను అందించారు. కార్యాలయంలో సోమవారం విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. గుంటూరు నగరానికి చెందిన సాయిలక్ష్మి అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇటీవల విద్యార్థిని సాయిలక్ష్మి తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కుటుంబం ఆర్థికంగా వెనుకబడింది. దీంతో ఆమె చదువుకునేందుకు సునీల్‌కుమార్ వీర్రాజు, శ్వేతల సహకారంతో రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని స్వయంగా అందజేశారు.

# కొత్త పింఛన్లు ఎప్పుడో?

- కొత్త పెన్షన్ల ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- దరఖాస్తు చేద్దామన్నా తెరుచుకోని వెబ్‌సైట్
- ఆందోళనలో లబ్ధిదారులు



తెనాలిఅర్బన్: వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగుల ఆశలు ఆడిఆశలు అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటుతున్న కొత్త పింఛన్ ఊసే లేకపోవటంతో అర్హులైన వారిలో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇదిలా ఉంటే స్పౌజ్ కోటాలలో ప్రతినెలా మంజూరయ్యే వాటిని కూడా ప్రభుత్వం నిలిపివేయటంతో వితంతువులు బ్రతుకు జీవుడా అంటూ కాలం వెళ్లబుచ్చాల్సి వస్తోంది.

గతంలోని రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, డప్పు కళాకారులు, ఒంటరి మహిళ, దీనిలో భాగంగా మొదట రూ.75 చొప్పున లబ్ధిదారులకు పంపిణీ చేసేవారు. ఆ తర్వాత నుంచి పెంచుకుంటూ టీడీపీ ప్రభుత్వంలో రూ.రెండు వేలు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పింఛన్‌ను రూ.3 వేలకు పెంచటంతో పాటు అర్హులందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నెలకు రూ.4 వేల చొప్పున ఇస్తు వస్తోంది. తెనాలి పట్టణ పరిధిలో మే నెలలో 14,975, మండల పరిధిలో 10,758 పంపిణీ చేశారు. అంటే తెనాలి పట్టణ, మండల పరిధిలో మే నెలలో 25,733 పంపిణీ చేశారు.

**ఏడాదిలో 1050 మందికి పింఛన్‌ల కోత**

తెనాలి పట్టణం, మండల పరిధిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పింఛన్‌ల కోతను విధిస్తూ వస్తోంది. కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయనే నెపంతో కొన్ని వృద్ధులు మృతి చెందుతుంటంతో వాటినే మరుసటి నెల స్పౌజ్ కోటలో మంజూరు చేయకుండా జాప్యం చేస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2024 ఏప్రిల్ నెల సమయంలో తెనాలి పట్టణ పరిధిలో 15,630 మందికి, మండల పరిధిలో 11,153 మందికి పింఛన్‌లను పంపిణీ చేసింది. అంటే తెనాలి పట్టణం, మండల పరిధిలో 26,783 మందికి వీటిని పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి సంఖ్య తగ్గుతూ వచ్చింది. వాటి వివరాలు ఇవి. పై పట్టికను పరిశీలిస్తే 2025 మే నాటికి తెనాలి పట్టణ, మండల పరిధిలో మొత్తం 25,733 పింఛన్లు చేస్తున్నట్లు అర్థమవుతుంది. దీనిబట్టి చూస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చివరి నెలలో 26,783 పెన్షన్‌లు పంపిణీ చేస్తే కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మే నెలల 25,733 పెన్షన్‌లు పంపిణీ చేస్తుంది. ఏడాదిలో 1050 పెన్షన్లకు కోత పడినట్లు తెలుస్తుంది.

**వైఎస్సార్‌సీపీ హయాంలో పార్టీలకతీతంగా..**

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పింఛన్లు అందించే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండుసార్లు నూతన పెన్షన్లను మంజూరు చేస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిన ఇప్పటి వరకు నూతన పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాలేదు. కనీసం వెబ్‌సైట్ కాదా ఓపెన్ కాకపోవడంతో సచివాలయ ఉద్యోగులు అర్హులైన వారు ఇచ్చిన దరఖాస్తులను వారి వద్దే ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెబ్‌సైట్ ఓపెన్ అయితే ఆన్‌లైన్ చేసి సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది.

**స్పౌజ్ పింఛన్లకు మంగళం**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎవరైన వృద్ధులు మరణిస్తే మరుసటి నెలలో స్పౌజ్ పింఛన్ కింద వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నూతన పింఛన్లు చేయకపోగా స్పౌజ్ పింఛన్ల కూడా మంగళం పాడింది. స్పౌజ్ పింఛన్ కింద పలువురు దరఖాస్తు చేసుకున్న అవి ఇప్పటి వరకు మంజూరుకు నోచుకోలేదు. ఎప్పుడు వస్తాయని లబ్ధిదారులు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి స్పౌజ్ పింఛన్లను వెంటనే మంజూరు చేయడంతో పాటు నూతన పెన్షన్‌లను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

| సంవత్సరం | నెల | తెనాలి పట్టణంలో పంపిణీ చేసిన వారి సంఖ్య. | తెనాలి మండలంలో పంపిణీ చేసిన వారి సంఖ్య |
|---|---|---|---|
| 2025 | జనవరి | 15145 | 10816 |
| | ఫిబ్రవరి | 15088 | 10782 |
| | మార్చి | 15031 | 10770 |
| | ఏప్రిల్ | 15023 | 10769 |
| | మే | 14977 | 10841 |

## ఆగస్టు నుంచి ట్రూ అప్ ఛార్జీలు నిలిపివేయాలి

తెనాలిటౌన్: విద్యుత్ చార్జీల బాదుడులో భాగంగా వినియోగదారులపై వేస్తున్న ట్రూ అప్ చార్జీలను ఆగస్టు నెల నుంచి నిలిపివేయాలని సీపీఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ కార్యాలయంలో ఈఆర్‌వోకు పార్టీనేతలు వినతిపత్రం అందజేశారు. 2014 నుంచి 2019 వరకు డిస్కంలకు అదనపు భారం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించుటకు సిద్ధంగా లేనందున ఆ మొత్తాన్ని 2022 నుంచి జూలై 2025 వరకు యూనిట్‌కు 22 పైసలు వినియోగదారుల నుంచి వసూలు చేయుటకు ఏపీఈఆర్‌సీ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తు చేశారు. దీనికి అనుగుణంగా 3013 కోట్ల మంది 2023 సంవత్సరం ఆగస్టు రెండు వాయిదాల పద్ధతి ద్వారా ప్రతి నెల యూనిట్‌కు 22 పైసలు చొప్పున 2025 జూలై నెల వరకు వసూలు చేసిన చార్జీలు సరిపోతాయని వెల్లడించారు. వచ్చే నెల ఆగస్టు నుంచి విద్యుత్ బిల్లులు ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలీ, పి.జోసేఫ్, ఎస్.సుబ్రమణ్యం, జి.వెంకటసుబ్బయ్య, కె.శ్రీనివాసరావు, కళ్యాణ చక్రవర్తి, వై.అశోక్ కుమార్, తదితరులు ఉన్నారు.



ఈఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## డంపింగ్ యార్డులో నిలచిన లోడింగ్



ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న మైనింగ్, రెవిన్యూ, పోలీస్ అధికారులు



అక్రమ ఇసుక రవాణా జరగకుండా మిషన్‌తో గాడికొట్టిస్తున్న అధికారులు

కొల్లిపర: స్థానిక డంపింగ్ ఇసుక స్టాక్‌పాయింట్‌లో అర్ధ రాత్రి సమయంలో అక్రమంగా నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి అని ఆరోపణలు రావటంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి మైనింగ్, రెవిన్యూ, పోలీస్ అధికారులు తవ్వకాలపై నిజనిజాలు పరిశీలించాలని ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం మైనింగ్, రెవిన్యూ , పోలీస్ అధికారులు ఇసుక స్టాక్‌పాయింట్‌లో ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించారు.అక్రమ ఇసుక రవాణా జరగకుండా ప్రొక్లెయిన్ మిషన్ ద్వారా ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద ఎటువంటి వాహనాలు పోకుండా ఇసుక గుట్ట చుట్టూ ఐదు అడుగుల లోటును గాడి కొట్టించారు.అనంతరం తహసీల్దారు జి.సిద్దార్థ మాట్లాడుతూ ఇసుక డంపింగ్ యార్డు వద్ద 30వేల మెట్రిక్ టన్నులు ఇసుక ను నిర్వాహకులకు అప్పగించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇసుక స్టాక్ పాయింట్‌లో 1620 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇసుక నిల్వ ఉందన్నారు. నిర్వాహకుల దగ్గర నుంచి వే బిల్లు, రిజిస్టర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రికార్డులను క్షుణంగా పరిశీలించి సరైన లెక్క తేల్చిన తరువాత ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తగుచర్యలు తీసుకోవటం జరుగుందన్నారు. స్టాక్‌పాయింట్‌ను పరిశీలించిన వారిలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఏసురత్నం, మైనింగ్ డీడీడీ చంద్రశేఖర్, రూరల్ సీఐ ఉమేష్ , మైనింగ్ ఆర్ఐ ఆంజనేయులు, మైనిగింగ్ సర్వేయర్ సీత్మబాయ్, ఆర్ఐ వంశీకృష్ణ పాల్గొన్నారు.

## ప్రారంభమైన కార్మెల్ మాత ఉత్సవాలు

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ భగవంతుడిపై భక్తి, ప్రేమలను కలిగి ఉండాలని ఫాదర్ వై.అంతోనిరాజు అన్నారు. మండల కేంద్రంలోని కార్మెల్ మాత ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కొండపై ఉదయం దివ్యపూజాబలి నిర్వహించారు. సాయంత్రం కార్మెల్ కొండవద్ద రేపల్లె విచారణ గురువులు పి.జోజిరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

## భవన నిర్మాణ అనుమతులు ఇప్పించండి

తెనాలిఅర్బన్: భవన నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని పట్టణవాసి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న చిన్న షాపుల తొలగింపును నిలిపివేయాలని, బీసీ కార్పొరేషన్ లోన్లు ఇప్పించాలని పలువురు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీలు శివన్నారాయణ, వాణి, ఆర్‌వో రాంప్రసాద్, మెప్మా సీఎంఎం విజయ, పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి కమిషనర్ లక్ష్మీపతిరావుకు వినతిపత్రం ఇస్తున్న వృద్ధురాలు

## విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

తెనాలిటౌన్: రావినూతల ఫౌండేషన్ చేస్తున్న సేవ కార్యక్రమాలు అభినందనీయమని అమృతలూరు మాజీ జడ్పీటీసీ చందోలు పృధ్వీలత పేర్కొన్నారు. రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలోని వీఎస్ఆర్ అండ్ జెడీఎం ప్లస్ 2 కళాశాల నందు సోమవారం విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనీఫాం పంపిణీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పృధ్వీలత పాల్గొని వీటిని అందజేశారు. రావినూతల వెంకుబాయమ్మ, కామేశ్వరమ్మ స్మారక మెమోరియల్, రోహిణి హాస్పటల్ తెనాలి సహకారంతో 65 మంది ఇంటర్ విద్యార్థులకు రూ.40లు విలువైన యూనీఫాం అందించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా నిరతి కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు అంకిత భావంతో చదువుకుని జీవితంలో ఉన్నతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, డాక్టర్ యామిని దివ్య, చందోలు శంకరరావు, లెక్చరర్ అన్నపూర్ణ, డాక్టర్ మధుబాబు, డాక్టర్ వినీల్, ఫౌండేషన్ సభ్యులు ఆర్.ప్రకాష్, సుబ్బలక్ష్మి, ఆరాధ్య, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



యూనీఫాం పంపిణీ చేసిన అనంతరం విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు

## తహసీల్దార్ పరిష్కార వేదికకు 11 అర్జీలు

తెనాలిటౌన్: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ తెలిపారు. ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి మూడు అర్జీలు, తల్లికి వందనం నగదు జమ కాలేదని, ఎలక్ట్రిసిటీకి సంబంధించిన రెండు అర్జీలు, పింఛన్‌కు సంబంధించి ఇలా పలు అర్జీలు వచ్చాయని, వీటిని సంబంధిత అధికారులకు బదలాయించి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీ పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

## వైఎస్ జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ

- ఆయన క్షేమమే మా లక్ష్యం
- గుమ్మడికాయలతో దిష్టి తీసిన మహిళలు, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజాదారణ తగ్గలేదని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి తాడేపల్లిలోని తన నివాసానికి రావడంతో నరదిష్టి తీసేందుకు భారీగా మహిళలు, లీగల్‌సెల్ నాయకులు గుమ్మడికాయలతో అక్కడకు చేరుకున్నారు. ఆయన రాగానే గుమ్మడికాయలపై కర్పూరం వెలిగించి దిష్టి తీశారు. ఈ సందర్భంగా లీగల్‌సెల్ నాయకులు బరిగెల కోటేష్, విజయవాడకు చెందిన మహిళా నాయకురాలు ప్రేమ్ త్రివేణి రెడ్డిలు మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్నా, పక్క రాష్ట్రంలో ఉన్నా పచ్చ మీడియాతో పాటు కూటమి నాయకులు రోజూ చర్చించుకుంటున్నారని.. ఆయనకు నరదిష్టి తగలకూడదనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.



దిష్టి తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు

## ఉప్పాల హారికపై దాడి హేయమైన చర్య

మంగళగిరి టౌన్: కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికపై కొందరు దుండగులు దాడి చేయడాన్ని, హారిక దంపతులను అప్రజాస్వామికంగా ఇబ్బందులకు గురిచేయడాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్‌లు సంయుక్తంగా ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జిల్లా స్థాయిలో ఉన్నతాధికారిగా ఉన్న ఒక బీసీ మహిళపై దుండగులు దౌర్జన్యానికి పాల్పడడం దుర్మార్గమన్నారు.

### తెనాలిలోని ఎస్‌టీపీని పరిశీలించిన చీఫ్ ఇంజనీర్



తెనాలిఅర్బన్: తెనాలి పూలే కాలనీలో నూతనంగా నిర్మించిన ఎస్‌టీపీ ప్లాంట్‌ను చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు సోమవారం పరిశీలించారు. ప్లాంట్ పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. త్వరలో దీనిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ ఆకుల శ్రీనివాసరావు, ప్రజా ఆరోగ్యశాఖ డీఈ శివరామకృష్ణ, ఏఈలు ఫణీ, సునీల్, సూరిబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి టౌన్: ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుభూతి మాటలతో గందరగోళ పరుస్తోందని.. వెంటనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు అన్నారు. సమస్యలను పరిష్కరానికి మంగళగిరి కార్పొరేషన్ ఎదుట నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త సమ్మెను ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి అనేక సార్లు సమస్యలను వివరించామని అన్నారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ.. సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని అన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ.. సమ్మెను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఫ్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మంగళగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీను సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వీవీ జవహర్ లాల్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, వి.శ్రీనివాసరావు, ఎస్.నాగరాజు, కె.శ్రీనివాసరావు, పి.రాము, కేధార్‌నాథ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

### కాంట్రాక్టర్ పున్నారావు అరెస్ట్

తెనాలిటౌన్: జగనన్న కాలనీలో ఇల్లు నిర్మిస్తామని లబ్ధిదారుల వద్ద నగదు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితుడు పున్నారావును అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు. సోమవారం స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడు అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. బుర్రిపాలెం గ్రామంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల నిర్మాణం చేపడతామని నగదు తీసుకుని పలువురు లబ్ధిదారులకు కాంట్రాక్టర్ ఎం.పున్నారావు మోసం చేసినట్లు తెలియజేశారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు పున్నారావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు చెప్పారు. నేలపాడు జగనన్న కాలనీకి సంబంధించి ఇటువంటి కేసులో పున్నారావును గతంలో అరెస్ట్ చేయగా ప్రస్తుతం నరసరావుపేట జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నట్లు చెప్పారు. పీటీ వారెంట్‌పై జైలు నుంచి తీసుకువచ్చి బుర్రిపాలెం కేసులో అరెస్ట్ చేసి తిరిగి నరసరావుపేట జైలుకు రిమాండ్ నిమిత్తం పంపుతున్నట్లు వెల్లడించారు. ముద్దాయి పున్నారావు పెదరావూరు గ్రామంలోని జగనన్న కాలనీలో పలువురు లబ్ధిదారుల వద్ద నగదు తీసుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని వివరించారు. ఈ కేసులో కూడా అరెస్ట్ చేయాల్సి ఉందని చెప్పారు. ఇతనేగాక మరికొంత మంది కాంట్రాక్టర్లు లబ్ధిదారుల వద్ద నగదు తీసుకుని ఇళ్ల నిర్మాణం చేయలేదని తెలియజేశారు. త్వరలో వీరిపై కూడా అరెస్ట్ ఉంటుందని స్పష్టం చేశారు.

### రేపటి నుంచి సమ్మె ఉధృతం చేస్తాం



మంగళగిరి టౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16వ తేదీ నుంచి సమ్మెను ఉధృతం చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య అన్నారు. సోమవారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఇంజనీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలియజేశారు. బుధవారం నుంచి జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కార్పొరేషన్ ఫెడరేషన్ అధ్యక్షురాలు కె.వెంగమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి నాయకులు బి.వెంకటేశ్వర్లు, రాజధాని సీఐటీయూ డివిజన్ అధ్యక్షులు ఎం.రవి, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, మంగళగిరి మండలం రూరల్ కార్యదర్శి దుర్గారావు, ఫెడరేషన్ నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, వై.శివనాగేశ్వరరావు, బాబూరావు, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### 223వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు సోమవారం నాటికి 223వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని కేసీ వర్క్స్ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావులు సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును ఏ కోర్టులో అప్పీలు చేసే వీలు లేదని.. అది తప్పక అమలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాషా, సాంబశివరావు, ఆశీర్వాదం, గురవయ్య, కార్మికులు వై.రమాదేవి, రిబ్కా, శారమ్మ, ఇమాంబి, దర్శి నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు